క్లుప్తంగా

మధిరలో రైళ్లకు హాల్టింగ్ లేదు..

మధిర: రైల్వే 3వ లైన్ పనులు చేపడుతున్న కారణంగా గతంలో మధిర రైల్వే స్టేషన్‌లో ఆగే రైళ్లకు ఈనెల 23 నుంచి 29 వరకు హాల్టింగ్ సౌకర్యం లేదని రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బీజేపీలో చేరిక



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన కొరిపల్లి సునీత, శ్రీను దంపతులు

చింతకాని: మండలంలోని వందనం గ్రామ మాజీసర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొరిపల్లి సునీత, శ్రీను దంపతులు ఖమ్మంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, జిల్లా నాయకులు మద్దినేని వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఆలస్యం వీరప్రసాద్, నాయకులు అనగాని రామారావు, రామకృష్ణ, షేక్ సిద్దేమియా, తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

కారేపల్లి: మండలంలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మొక్కులు చెల్లించుకోగా, ఆలయ ప్రధాన పూజారి కొత్తలంక కైలాషశర్మ ఆధ్వర్యాన పూజలు చేశారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సాయినాధుడికి గురువారం ఆయా దేవాలయాల అర్చకులు సాంప్రదాయ బద్దంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కర్పూర హారతి ఇచ్చారు. భక్తులు సాయిబాబాని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల్లో పలు గ్రామాల భక్తులు భజనలు చేస్తూ సాయి గీతాలను ఆలపించారు. మండల కేంద్రంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లిలోని శ్రీఅమృతసాయి ఆలయం, రాజీవ్‌నగర్ విజయసాయి ధ్యాన మందిరంలలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకర్లపల్లి ఆలయంలో మన్యం అశోక్, శ్రావణి దంపతులు, శ్రీ విజయసాయి ధ్యాన మందిరంలో పరాంకుశం భాస్కర్, సత్యావాణి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మందపాటి శారద, చిలుకూరి దీప్తి, వీరిశెట్టి సురేష్‌బాబు, కృష్ణారావు, వల్లెపు రాంబాబు, మట్టా రాగవరావు, మోరంపూడి సత్యనారాయణ, మోరంపూడి వెంకటేశ్వరరావు, అర్చకులు వెల్లటూరి ఉపేంద్రాచారి, రామడుగు లుగుదర చార్యులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో టాపర్‌గా మేడేపల్లి విద్యార్థిని

ముదిగొండ: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్) టెస్ట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడేపల్లి విద్యార్థులు 11 మంది ఎంపిక కాగా.. వారిలో దుశర్ల యశ్వంతి జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించింది. దుశర్ల యశ్వంతి, జూలకంటి పునీత్ రెడ్డి, తోట ఆనంద తీర్థ, కటికాల లావణ్య, రెడ్డి మల్ల వరుణ్ సందేశ్, భయ్యం చందన, చెన్ను సింధు, పెండ్యాల సాత్విక్, ఎలకల కార్తీక్, బొడ్డు ముఖేష్ ఎస్సీ కేటగిరీలో, రెడ్డి మల్ల హర్షిత బీసీ కేటగిరిలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, విద్యార్థులను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ సర్పంచ్ రమేష్, పాఠశాల హెచ్ఎం బండి నాగేశ్వరరావు, పీఈటీ కృష్ణయ్య అభినందించారు.

పరామర్శ..

చింతకాని: ఇటీవల చింతకాని రైల్వేస్టేషన్ సమీపంలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మతిస్థిమితం లేని రోహిత్ రైలు నుంచి జారిపడి మృతి చెందగా.. అతనిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచిన విషయం తెలిసిందే. గురువారం మృతుడి కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి రాగా.. విషయం తెలుసుకున్న ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి వినోదరావు ఆస్పత్రికి చేరుకుని మృతుడి కుంటుబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని ఒడిస్సా రాష్ట్రంలో వారి స్వస్థలానికి తరలించేందుకు ఆర్థిక సాయం అందజేశారు.

ఖరీఫ్‌లో.. సాగర్ నీరు అందేనా..!

- ఈ ఏడాది రబీ పంటను కోల్పోయిన సాగర్ ఆయకట్టు రైతులు
- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న అన్నదాతలు
- మరమ్మతులకు నోచుకోని కాల్వలు
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు



లక్ష్మీనగర్ సమీపంలో సిరిపురం మేజరు కాల్వ

తల్లాడ: ఈ ఏడాది రబీ పంటను కోల్పోయిన రైతులు ఖరీఫ్ పంటకైనా సాగర్ నీరు అందుతుందో.. లేదో అని ఆశతో ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్‌లో సాగర్ జలాలు వస్తేనే మాగాణి భూములు సేద్యం చేసుకొనే అవకాశం ఉంటుంది. వర్షాలు అనుకూలంగా కుర్సిన నాగార్జున సాగర్‌లో పూర్తి స్థాయిలో నీటి మట్టం ఏర్పడితేనే ఈ మండలంలో వరి పైరు పండుతోంది. నాగార్జున సాగర్ కాల్వల మీదనే ఆదార పడి ఉన్న మండల రైతులు ఖరీఫ్‌పై ఆశలు పెంచుకుంటున్నారు. ఖరీఫ్ పంట సాగుకు రైతులు సన్నద్ధమౌతున్నారు. ఇందుకోసం ఈ నెలలో కుర్సిన వర్షాలకు దుక్కులు దున్నారు. వరి నార్లు పోసేందుకు విత్తనాల కోసం రైతులు పగురులు పెడుతున్నారు.

– తల్లాడ మండలంలో ప్రధానమైన పంట వరి. ఖరీఫ్, రబీ సీజన్లలో వరిసాగు చేస్తుంటారు. ప్రతి ఏటా సాగర్ నీటిని విడుదల చేస్తే రెండు పంటలు పండిస్తుంటారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల మూలంగా నాగార్జున్‌సాగర్ డ్యామ్‌లోనే నీటిమట్టం పూర్తిగా పడిపోవటంతో రబీలో నీరు విడుదల చేయలేదు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఖరీఫ్‌లోనే సాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన వరి రైతులకు నీటి కష్టాలు ఎదురవ్వడంతో రబీలో ఎవ్వరూ పంట వేయడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. ఎన్ఎస్‌పీ అధికారులు కూడా సాగర్ కింద రబీ పంటలు వేయొద్దని హెచ్చరించారు. దీంతో ఈ సంవత్సరం రైతులు రబీ పంటను కోల్పోయారు.

22 వేల ఎకరాలు బీడుగానే..

పచ్చని పైరుతో కళకళ లాడాల్సిన వరిపొలాలు ఈ ఏడాది నీటి కొరత కారణంగా 22వేల ఎకరాలు బీళ్లుగానే పడి ఉన్నాయి. సాగర్ ఆయకట్టు కింద 23 వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా కేవలం వెయ్యి ఎకరాలు సాగర్ ఉండి బావులు, బోర్లు అవకాశం ఉండగా సాగు చేశారు. బావులు, బోర్లు కింద మరో ఐదు వందల ఎకరాల్లో రబీలో వరిసాగు చేశారు. ఈ ఏడాది సాగర్ ఆయకట్టు కింద 90 శాతం మేర రైతులు రబీ పంట లేక నష్టపోయారు. ఇక చెరువులు, కుంటల కింద కొంత వరి సాగు చేసినా అవి కూడా సాగర్ నీటి మీదనే అదారపడి ఉంటున్నాయి. దీంతో అది కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది రబీలో మండలంలో కోట్ల రూపాయల పంటను కోల్పోయారు.



పిచ్చి చెట్లతో అధ్వానంగా ఉన్న తల్లాడ మైనర్ కాల్వ



సిరిపురం మేజరు కాల్వలో పగిలిపోయిన డ్రాపు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు..

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. 23 వేల ఎకరాల్లో వరి పంట వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాక్టర్‌తో దుక్కులు దున్నించారు. అలాగే వరినార్లు పెంపకానికి వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాల కోసం విత్తన దుకాణాల వద్ద రైతులు బుక్ చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో సాంబ సన్న రకాలనే ఎక్కువగా సాగు చేస్తుంటారు.

మరమ్మతులకు నోచుకోని కాల్వలు..

నాగార్జున సాగర్ కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వేసవి కాలంలో మరమ్మతులకు అనుకూలంగా ఉంటుంది. మళ్లీ వర్షాలు కురిస్తే కాల్వలు బాగు చేయటానికి వీలుపడదు. మేజర్, మైనర్ కాల్వల్లో తక్షణమే అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలి.

ఖరీఫ్ పంటపైనే ఆశలు..



గత సంవత్సరం రబీలో మాగాణి పంట వేయలేదు. మెట్ట భూమిలో సాగు చేసిన జొన్న పంట కూడా సరిగా దిగుబడి రాక నష్టపోయా. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పంట అనుకూలంగా ఉంటుందనీ భావిస్తున్నా. ఖరీఫ్ అనుకూలించకపోతే అన్నీ అప్పులే మిగులుతాయి.

– మూడ్ లచ్చిరాం, రైతు, గాంధీనగర్ తండా

చివరి భూములకు నీరందడం కష్టమే..



ఖరీఫ్‌పై ఆశలు పెంచుకున్నాం. కానీ కాల్వలకు మరమ్మతులు లేవు. రబీ పంట నష్టపోయిన మాకు ఖరీఫ్ పంటకైనా సాగర్ నీరువస్తుందనే ఆశతో ఉన్నాం. కాల్వలకు మరమ్మతులు చేసి చివరి భూములకు సైతం నీరందేలా అధికారుల చర్యలు తీసుకోవాలి.

– ఇంజం సత్యనారాయణ, రైతు, రేజర్ల

రైతులకు రశీదు ఇవ్వాలి



మాట్లాడుతున్న సత్తుపల్లి ఏడీఏ నరసింహారావు



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నాగుల్‌మీరా

తల్లాడ: డీలర్లు తప్పనిసరిగా రైతులకు రశీదు ఇవ్వాలని సత్తుపల్లి వ్యవసాయ శాఖా ఏడీఏ నరసింహారావు అన్నారు. గురువారం తల్లాడ రైతు వేదికలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలను ప్రభుత్వ అనుమతి పొందిన షాపుల వద్దనే కొనాలన్నారు. స్టార్ రిజిష్టర్, బిల్ బుక్స్ యాక్ట్ ప్రకారం నిర్వహించాలని, ఎరువులు విక్రయాలు తప్పని సరిగా పాస్ మిషన్ ద్వారానే నిర్వహించాలన్నారు. తల్లాడ ఎస్సై కొండల్‌రావు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మినట్లతై ఐపీసీ సెక్షన్ ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయాధికార ఎండి.తాజుద్దీన్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ విత్తన స్టాక్ పొజిషన్ రిపోర్ట్ డీలర్లు ఇవ్వాలని, నిర్ణయించిన ధరలకే పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల వ్యవసాయ విస్తరణాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన..

తల్లాడ: రైతులు వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన షాపుల వద్దనే విత్తనాలు కొనాలని ఏఈఓ షేక్.నాగుల్‌మీరా సూసించారు. గురువారం మండలంలోని బిల్లుపాడు గ్రామంలో నకిలీ విత్తనాలపై అవగాహన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతుండటంతో రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. షాపులో విత్తనాలు కొనేటప్పుడు విత్తనంతో పాటు బిల్లు రశీదు కూడా తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. అలాగే లైసెన్స్ లేకుండా లూజ్ విత్తనాలు గుడ్డ సంచుల్లో తీసుకొచ్చి బిల్లులు లేకుండా అమ్మేవారి దగ్గర విత్తనాలు కొనొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు జక్కంపూడి రమేష్, ఎనిక అనంత రాములు, పులబాల వీరభద్రరావు, శ్రీనివాసరావు, మేముల నరసింహారావు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలని వినతి..

రాబోయే ఖరీఫ్ సీజన్‌కు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండల వ్యవసాయాధికారి ఎండి.తాజుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులను అరికట్టాలని కోరారు. మండలంలో గత ఖరీఫ్, రబీ కాలంలో రైతులు కొంతమంది నకిలీ విత్తనాలతో నష్ట పోయారని, మళ్లీ అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సకాలంలో సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, నాయకులు తేజావత్ బాలాజీ నాయక్, చల్లా నాగులు, దూపాటి భద్రరాజు, నాగేశ్వరరావు, సుదాకర్, రాయల రమేష్, నరేష్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ, పోలీసులు

కారేపల్లి: నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే.. కఠిన చర్యలు ఉంటాయని కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం, మండల వ్యవసాయాధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం కారేపల్లిలోని విత్తన దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న విత్తన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు పొందాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించిన, నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టిన సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు.



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్సైరాజారాం

కల్యాణం.. కమనీయం

జవహర్‌నగర్‌లో శ్రీ వేణుగోపాల స్వామి..



కల్యాణ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేదపండితుడు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ట, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించి 40 రోజులు పూర్తైన సందర్భంగా గురువారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవానికి ఘనంగా నిర్వహించారు. ముందుగా కుంబాభిషేక మహోత్సవం, వాస్తుహోమం, విశేష పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కంచేటి రమేష్, గంధం బాబి, దేవళ్ల రామకృష్ణ, కారుమంచి సురేష్, రంగపూరి వెంకటేశ్వరరావు, పెంద్ర బాపయ్య, శైలజ, పద్మ, ధనలక్ష్మి, వరలక్ష్మి, నాగేంద్రబాబు, అద్దంకి అనీల్, దేవళ్ల పెద్దిరాజు పాల్గొన్నారు.

మత్కేపల్లిలో వేంకటేశ్వరస్వామి..

చింతకాని: మండలంలోని మత్కేపల్లి తుమ్మలమ్మ చెరువు పక్కన గట్టుపై ఉన్నటువంటి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం వేదపండితులు బొర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ పద్మావతి సమేత వేంటేశ్వరస్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ముందుగా స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో గణపతిపూజ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, యజ్ఞోపవేద ధారణ, పాద ప్రక్షాళన్నం, కన్యాదానం వంటి పూజా కార్యక్రమాల అనంతరం జీలకర బెల్లం, మాంగల్యధారణ, వారణమాయిరం, ఆశీర్వచనం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణానికి జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రావు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై నాగుల్‌మీరా, దేవాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తోటకూరి వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపీ కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, చింతకాని, పాతర్లపాడు, నాగులవంచ గ్రామపెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కారేపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జరగనుండగా, ఏర్పాట్లు చేశామని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం తెలిపారు. కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కారేపల్లి మోడల్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. రెండుచోట్ల 400మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30నుంచి 5.30గంటల వరకు పరీక్షలు జరగనుండగా, నిర్ణీత సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి ఉండదని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

నేటి నుంచి జీలుగులు పంపిణీ

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో శుక్రవారం నుంచి సబ్సిడీపై రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేయనున్నారు. 30 కేజీల జీలుగు విత్తనాల బస్తా రూ.3,750లు కాగా సబ్సిడీ పోను రూ.1,116లు రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీలుగులు కావాల్సిన రైతులు స్థానిక ఏఈఓకు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ చూపించి కూపన్ పొందాలన్నారు. ఈ కూపన్ ద్వారానే సొసైటీలో జీలుగు విత్తనాలు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొణిజర్ల: కొణిజర్ల, చింతకాని మండలాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పెద్దగోపతి సబ్‌డివిజన్ ఏడీఈ ఎల్ తిలక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొణిజర్ల, చింతకాని, కొదుమూరు సబ్ స్టేషన్ల పరిధిలోని 11, 33 కేవీ విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని సూచించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన బీఎన్‌తండా జట్టు

ఏన్కూరు: మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ప్రథమ బహుమతి భగవాన్ నాయక్ తండా జట్టు గెలుచుకొనగా.. ద్వితీయ బహుమతి ఏన్కూరు, తృతీయ బహుమతి రేపల్లెవాడ గ్రామాల జట్లు గెలుచుకున్నారు. విజేతలకు ఖమ్మం ఆర్క ఆస్పత్రి యాజమాన్యం, రాయలరామలింగం, మేడ ధర్మారావు బహుమతులు అందజేశారు.

15వ బెటాలియన్‌లో ఎస్‌పీసీ స్టోర్ ప్రారంభం



ఎస్‌పీసీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకటరాములు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌పీసీ స్టోర్‌ను కమాండెంట్ పి.వెంకటరాములు గురువారం ప్రారంభించారు. వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐపీఎస్ అధికారిణి స్వాతిలక్ర ఆదేశాల మేరకు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ పి.వెంకటరాములు మాట్లాడుతూ.. ఈ స్టోర్ వల్ల బెటాలియన్‌లోని అధికారులు, సిబ్బంది కుటుంబాలకు నిత్యావసర వస్తువులను ఎంతో తక్కువ ధరకే సబ్సిడీపై అందుబాటులో ఉంటాయని వివరించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బందికి ఈ సదుపాయాన్ని కల్పించిన టీఎస్ఎస్‌పీ బెటాలియన్ అధికారిణి స్వాతిలక్రకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతులు ఎ.తిరుపతి, ఎస్ఓ రంగారెడ్డి, ఏఓ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



మధిర: మాట్లాడుతున్న దుర్గాప్రసాద్



ఏన్కూరు: మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

మధిర/ఏన్కూరు/ముదిగొండ: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. గురువారం మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, ఏన్కూరులోని భగవాన్‌నాయక్ తండాలో జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి మల్లన్న కృషి చేస్తారని తెలిపారు. అదే విధంగా ముదిగొండలో కమలాపురం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణగుప్తా, ఖమ్మం పట్టణ అధ్యక్షుడు ఎస్.కె జావిద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మధిర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎలక్షన్ కోఆర్డినేటర్ మహమ్మద్ జావిద్, పసుపులేటి దేవేంద్రం, వల్లూరి భద్రారెడ్డి, మహమ్మద్ అజ్గర్, దేవరపల్లి అనంతరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, బిక్షాల బిక్షం, చెరుకుపల్లి రాంబాబు, ధర్మ నాయక్ ,జెట్టి వినోద్, తాటికొండ రమేష్, పందిరి అంజయ్య, పిల్లుట్ల రాఘవ, బాబు రామ్ రెడ్డి, ఇలవల పుల్లారెడ్డి, సామినేని వెంకటయ్య,చిలకల రామకష్ణ, దమ్మలపాటి సరస్వతి, కుక్కల వెంగళరావు, దారా బాలరాజు, అద్దంకి రవికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, చిలువేరు బుచ్చిరామయ్య, దుంపా వెంకటేశ్వరరెడ్డి, నిడమానూరు వంశీకృష్ణ, యన్నం కోటేశ్వరరావు, షేక్ జహంగీర్, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, గుత్త వెంకటేశ్వరావు, స్వర్ణ నరేందర్, లచ్చిరాం నాయక్, మంగీలాల్, మధు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి

ప్రచార పర్వం

వైరా: ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యతగా 36వ సీరియల్ నంబర్‌పై ఓటు వేసి గెలిపించాలని మండలంలోని చిన్నగోపతికి చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి దునుకు యాలాద్రి కోరారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పట్ట భద్రులను ఓట్లు అభ్యర్థించారు. కాకతీయ యూనివర్సిటీ స్కాలర్ అయిన తనను గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రశ్నించే గొంతుక ఉండాలి

మధిర: పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలంటే శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఉండాలని బీఆర్ఎస్ నాయకులు మొండితోక జయాకర్ కోరారు. మధిర మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును రాకేష్ రెడ్డికి వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు, గద్దల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

తల్లాడ/పెనుబల్లి: పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. గురువారం తల్లాడలోని అన్నారుగూడెం, పెనుబల్లిఓని వీయంబంజర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులను, ఉద్యోగస్తులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటరామారావు, సుధాకర్, బాణాల లక్ష్మారెడ్డి, ఈవీ రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, పడిగల మధు తదితరులు పాల్గొన్నారు.

ఓసీ ఉద్యోగులకు తేనీటి విందు

సత్తుపల్లి: మండల పరిధిలోని కిష్టారం ఓసీ కార్యాలయం వద్ద గురువారం కిష్టారం ఓసీ పీఓ ఎంవీ నర్సింహారావు ఆధ్వర్యంలో ఈద్–ఉల్–ఫితర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం తేనీటి విందులో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామకృష్ణ, ఇంజనీరు జగదీష్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కిషోర్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ బాలాజీ, సంక్షేమాధికారి సందీప్, ఓసీలోని ఉద్యోగులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

కొణిజర్ల: అమర వీరుల ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం అన్నారు. మండలంలోని తనికెళ్లలో గురువారం యాసా లక్ష్మీనరసయ్య, పెద్దమళ్ల అప్పారావుల వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వారి స్మారక స్థూపాల వద్ద పూలమాలలుంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాలన్నీ కులం, మతం డబ్బు చుట్టూ తిరుగుతున్నాయని.. ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే అన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి కృష్ణ, షేక్ రంజాన్, అన్నారపు వెంకటేశ్వర్లు, పీవీరావు, యాసావెంకటేశ్వర్లు విష్ణుమూర్తి, వెంకటే శ్వరరావు, నారాయణ, సాంబ తదితరులు పాల్గొన్నారు.



పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం నాయకులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
వైరా ఐ. రాందాస్ - 98898 81843
రమేష్, ACO - 9059115968
మధిర వీరబాబు - 98498 64638
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642